నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శుక్రవారం 16 ఆగస్టు 2024 | NALGONDA

సూర్యాపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శన

త్రివర్ణ శోభితం

జిల్లాలో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

వాడవాడలా జాతీయ జెండాల ఆవిష్కరణ

పరేడ్ గ్రౌండ్‌లో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శకటాల ప్రదర్శన.. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేత

భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు ఎగురవేసి వందనం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడంతోపాటు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

– రామగిరి, ఆగస్టు 15

నల్లగొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, తదితరులు

సూర్యాపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి
- జిల్లా పజల జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషి
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ) : ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం అని, ఆ ఫలాలు అందరికీ పంచాలనేది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం ఎన్ని వేల కోట్ల రూపాయలైనా ఖర్చు చేసేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్‌తో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ జిల్లా ప్రగతి, ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటివరకు జిల్లాలో 1.29కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, వీరికి రూ.66.84 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 19,096మంది చికిత్స పొందారని తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ. 5లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ.500 వంట గ్యాస్ సిలిండర్‌ను ఇప్పటి వరకు జిల్లాలో 1.48లక్షల మందికి అందించామన్నారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 1.75లక్షల కుటుంబాలకు రూ.28.5 కోట్ల ఉచిత విద్యుత్‌ను ఇచ్చామని తెలిపారు. జిల్లాలో రెండు విడుతల్లో కలిపి 82,593 మంది రైతులకు రూ.573కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు. జిల్లాలో రూ.519.77కోట్లతో ఎత్తి పోతల పథకాలు ఏర్పాటు చేస్తున్నామని, రూ.418 కోట్లతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వను ఆధునీకరించామని తెలిపారు.రూ.144కోట్లతో మూసీ ప్రాజెక్టు కాల్వలు ఆధునీకరించామని, రూ.244.45 కోట్లతో 20చెక్ డ్యామ్‌లు నిర్మిస్తున్నామని అన్నారు. ధరణిలో 56,266 దరఖాస్తులు వచ్చాయని, 94శాతం పరిష్కరించామని తెలిపారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా 2.62లక్షల మందికి జాబ్‌కార్డులు ఇచ్చామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసులు అనుక్షణం పని చేస్తున్నారని, గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ పదార్థాలపై ఉక్కుపాదంతో అణచివేయాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధులైన సూర్యాపేటవాసులు అంజయ్య, జానకిరాములు, గరిడేపల్లి నివాసి పుల్లారెడ్డిని మంత్రి ఉత్తమ్ సన్మానించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. రూ.52.44 కోట్ల చెక్కును స్వయం సహాయం సంఘాలకు, రూ.35.36కోట్ల చెక్కును మెప్మా సిబ్బందికి అందజేశారు. ఉత్తమ ఉద్యోగులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్‌డీఓ వేణుమాధవ్, జడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డటీడీఓ శంకర్, డీఈఓ అశోక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పాలన

- త్యాగాల నల్లగొండను అన్ని రంగాల్లో ముందుంచడమే లక్ష్యం
- నల్లగొండకు టన్నెల్ ద్వారా నీళ్లిచ్చేందుకు కృషి
- పంద్రాగస్టు వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 15 : త్యాగాల నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ముందున్న మొదటి లక్ష్యమని, అందుకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుదామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండా విష్కరణ చేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత ఆయన జిల్లా అభివృద్ధి, పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఆయన మాట్లాడారు. నల్లగొండకు టన్నెల్ ద్వారా సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో తాను అమెరికాకు వెళ్లి రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మిషన్ తయారీ కంపెనీతో ఒప్పందం చేసుకొని వచ్చానన్నారు. మూసీ నీటిలో పలు రోగాలకు కారణమైన కొలిఫాం బ్యాక్టీరియా ఉన్నందువల్ల మూసీని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. నల్లగొండలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసి ప్రతియేటా లక్షల మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగ దారులకు జీరో బిల్లులు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య పరిమితి రూ.10లక్షలకు పెంచామని, త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతామని చెప్పారు. 1.71లక్షల మంది రైతులకు రుణమాఫీతో నల్లగొండ జిల్లా రికార్డు సాధించిందన్నారు. ఏఎమ్మార్పీ ఎస్ఎల్‌బీసీ ద్వారా హైలెవల్, లోలెవల్ కాల్వలకు నీరు ఇవ్వడంతోపాటు ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా నీళ్లు ఇవ్వడానికి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నెట్‌వర్క్ సిస్టమ్‌ను చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 2.98 లక్షల మంది రైతులకు రైతు బీమా అమలు చేయడంతోపాటు ఎకరాకు రూ.15వేల రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్ఎల్‌బీసీలో 42 ఎకరాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పనులు జరుగుతున్నాయని, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించామని చెప్పారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ బడుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు, ఎంజీయూలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. ఎన్‌హెచ్-65పై ప్రమాదాల నివారణకు ఆరులైన్లుగా మార్చడానికి రూ.541 కోట్లు కేటాయించామని, త్వరలో పనులు చేపడుతామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడడంతో పాటు డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్, అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, డీఆర్వో రాజ్యలక్ష్మి, ఏఎస్పీ రాములు నాయక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో చిన్నారుల నృత్యాలు

మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు, ప్రజలు

నల్లగొండలో జాతీయ జెండాతో యువతుల ఆనందం

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, చిత్రంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, భూపాల్‌రెడ్డి, లింగయ్య, విజయసింహారెడ్డి తదితరులు

రామగిరి, ఆగస్టు 15 : నల్లగొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమావత్ రవీందర్‌కుమార్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చకిలం అనిల్‌కుమార్, నిరంజన్‌వలీ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, మాజీ ఆర్వో మాలె శరణ్యారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పంకజ్ యాదవ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్లు, పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ చేసిన నల్లగొండ మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మిర్యాలగూడ మాజీ జడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

నాగార్జునసాగర్ డ్యామ్ 6 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలవుతున్న నీరు

కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

- గురువారం ఉదయం 6 గేట్లు, సాయంత్రం 2 గేట్లు ఓపెన్

నందికొండ, ఆగస్టు 15 : శ్రీశైలం నుంచి 95,578 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ 6 క్రస్ట్ గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. సాగర్ డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులకు ప్రస్తుతం పూర్తి స్థాయిలో నీరు నిల్వ ఉంది. బుధవారం డ్యామ్ 2 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించగా శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో పెరుగడంతో గురువారం గేట్ల సంఖ్యను 6కు పెంచారు. సాయంత్రం ఇన్‌ఫ్లో తగ్గడంతో 2 క్రస్ట్ గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 8,023, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,948, వరద కాల్వ ద్వారా 600, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. సాగర్ మొత్తం 63,089 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అదే స్థాయిలో అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిండి ఉండడంతో మరికొన్ని రోజులు డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు చెబుతున్నారు.

పట్నం నుంచి పల్లెబాట

చౌటుప్పల మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల రూరల్, ఆగస్టు 15 : వరుసగా సెలవులు రావడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ప్రజలు పల్లె బాట పట్టారు. ఈ నెల 15న పంద్రాగస్టు, 16న వరలక్ష్మి వ్రతం, 18న ఆదివారం, 19న రాఖీ పౌర్ణమి ఉండడంతో ఉద్యోగులు, విద్యార్థులు సొంతూళ్లకు పయనమయ్యారు. దాంతో 65వ జాతీయ రహదారి విజయవాడ వైపు వచ్చే వాహనాలతో రద్దీగా మారింది. చౌటుప్పల మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో వాహనాల రాక కనిపించింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

హాలియా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్, డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

హాలియా/నందికొండ, ఆగస్టు 15 : సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. అనంతరం నందికొండ హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ఏరియా దవాఖానను వెళ్లారు. ఆస్పత్రిలో రికార్డులు, రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందులు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్‌నాయక్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, డెంగ్యూ లాంటి కేసులు నమోదైతే తగిన విధంగా వైద్యం అందించాలని సూచించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు వేణుగోపాల్‌రెడ్డి, గీతావాణి, రవి, జిల్లా టీబీ అధికారి కళ్యాణ చక్రవర్తి, సీఎంఓ భానుప్రసాద్, హాలియా వైద్యాధికారి రామకృష్ణ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు కృష్ణ కుమారి, అరుంధతి, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది బొడ్డుపల్లి సైదులు, దయాకర్, జావిద్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వైజాగ్ కాలనీ సమీపంలో సాగర్ వెనుక జలాల్లో చేపలు పడుతున్న మత్స్యకారులు

సాగర్ వెనుక జలాల్లో ప్రకృతి రమణీయత

రెండేళ్ల తర్వాత సమృద్ధిగా నీళ్లు

చందంపేట(నేరెడుగొమ్ము), ఆగస్టు 15 : సుమారు రెండేండ్ల తర్వాత నాగార్జున సాగర్ కొత్త అందాలు అద్దుకుంది. దాంతో ప్రాజెక్టు వెనుక జలాలు పెరిగాయి. నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ సమీపంలో నిండుగా కనిపిస్తున్న జలాలతో ప్రకృతి అందాలు పర్యాటకులకు కట్టిపడేస్తున్నాయి. నీళ్లు పుష్కలంగా ఉండడంతో మత్స్యకారులు జోరుగా చేపల వేట సాగిస్తున్నారు. సాగర్ నీళ్లు పెరుగడంతో నేరేడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ, బుగ్గతండా, సుద్దబాయితండా, చిన్నమునిగల్, పెద్దమునిగల్, తూర్పుతండా, మోసంగడ్డతండా, చందంపేట మండలంలోని గువ్వలగుట్ట, మంగళితండా, నక్క దుబ్బతండా ప్రజలు, మత్స్యకారులకు ఉపాధి దొరికినట్లయ్యింది. ఇక సాగర్ వెనుక జలాలను ఆనుకొని పంటలు సాగు చేసే రైతులకు కూడా నీటికి ఢోకా లేదు.